ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 22 | సంచిక : 9 | మే 2017

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

24-02-2017
జిన్నూరు

12-03-2017
చించినాడ

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 24-02-2017, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు మహాశివరాత్రి. శివుడిని నిత్యావతారం అంటారు. శరీర రహితుడు, సృష్టి అంతా వ్యాపించి ఉన్నవాడు, మన అంతర్యామి అయిన శివుడు ఈ రోజున లింగరూపం ధరించాడు. లింగం అంటే గుర్తు. ఆయన అవయవరహితుడే, అశరీరుడే అయినప్పటికీ భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే గుర్తుకోసం ఆయన లింగరూపం ధరించాడు. బ్రహ్మపదార్ధానికి రూపం లేదు, నామం లేదు. దానిని మన మనస్సుతో ఊహించలేము, ఇంద్రియాలతో దర్శించలేము. మనకు రూపదృష్టి, నామదృష్టి ఉంది. అందుచేత మనకు ఆ రూపం ఏదో చూపిస్తూ, ఆ రూపం మీద మనకు భక్తి కలుగచేసి, ఆరూపం ద్వారా మనల్ని బ్రహ్మంలో ఐక్యం చేయటానికి పరమేశ్వరుడు లింగరూపం ధరించాడు. తొలిలింగం, ఆదిలింగం అరుణాచలం. మహావిష్ణువు అలంకారప్రియుడు, శివుడు అభిషేకప్రియుడు. మీకు విష్ణువురూపం ఇష్టమయితే ఆ రూపాన్ని ధ్యానం చేసుకోండి, శివుడి రూపం ఇష్టమయితే శివుడిని ధ్యానం చేసుకోండి, గురువురూపం ఇష్టమయితే గురువు రూపాన్ని ధ్యానం చేసుకోండి. కాని అది ముఖ్యంకాదు. ఆ రూపాన్ని, ఆ నామాన్ని సపోర్టుగా తీసుకొని మనం బ్రహ్మంలో ఐక్యమవ్వాలి. మనం హైదరాబాద్ వెళ్ళటానికి ట్రైన్ ఎక్కుతాము. ట్రైన్‌లో కూర్చోవటానికి మనం రైలు ఎక్కటం లేదు, హైదరాబాద్ వెళ్ళటానికి రైలు ఎక్కుతున్నాము. అలాగే మన గమ్యం

చేరుకోవటానికి దేవతలను ఉపాసన చేస్తున్నాము. అయితే ఆ దేవతలకు రూపాలు ఉన్నాయా అంటే మనకే రూపాలు లేనప్పడు వారికి రూపాలు ఎలా ఉంటాయి. గాఢనిద్రలో ఉండగా మనకు ఏ రూపంతోటి తాదాత్మ్యం లేదు. మనం ఏదైతే కాదో వాటి అన్నింటిలోనుండి గాఢనిద్రలో మనం విడిపోతున్నాము. నిద్ర కూడా మనకు గురువే. గాఢనిద్రలోనుండి జాగ్రదావస్థలోనికి రాగానే మనకు శరీర ధ్యాస వస్తుంది. అక్కడ నుండి కులాలు, మతాలు, ఆస్తులు, దేవుళ్ళు, పిల్లలు ఇలా రకరకాల గొడవలు వస్తాయి. అంటే మనస్సు రాగానే మనస్సు కల్పించిన గొడవలు అన్నీ వచ్చేస్తాయి. మాకు శాంతిలేదు అని చాలామంది అంటారు. మీకు ఇంటి దగ్గర పరిస్థితులు బాగాలేకపోతే మీకు అశాంతి రావచ్చు. మీకు భౌతికంగా అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నా అశాంతి వస్తోంది. అసలు మనస్సు వచ్చిందంటే అది ఏదో గొడవ తీసుకొనివస్తుంది. ఇలా పదిమందిలో కూర్చొన్నప్పడు దాని గురించి మీకు తెలియదు. ఒక గంట ఏకాంతంగా కూర్చొంటే మీ మనస్సులో ఏముందో స్పష్టంగా స్కేనింగ్ తీసినట్లు మీకు తెలుస్తూ ఉంటుంది. అందుచేత రోజూ ఒక గంట ఏకాంతవాసం అలవాటుచేసుకోండి.

జ్ఞానులకు ఏమీ అవసరం లేదు. పైకి వాళ్ళు మీకు ఎలా కనిపిస్తున్నా వాళ్ళకి ఏమీ అవసరం లేదు. ఆవులు రంగులు రంగులుగా ఉంటాయి కాని పాలు మాత్రం తెల్లగా ఉంటాయి. అలాగే రామకృష్ణుడు, భగవాన్ వారి ఉపాధులలో తేడా ఉన్నప్పటికీ, మాట్లాడే విధానంలో తేడా ఉన్నప్పటికీ లోపల జ్ఞానం సమానమే. శరీరం రంగు తేడాగా ఉండవచ్చు, పుట్టిన ప్రదేశాలు వేరు అవ్వవచ్చు, వాళ్ళ బ్రాటఫ్ వేరు అవ్వవచ్చు, వాళ్ళ చదువులు వేరు అవ్వవచ్చు కాని లోపలఉన్న వస్తువు వారికి ఎరుకలోనికి వచ్చాక అందరూ సమానమే. బ్రాహ్మీస్థితి పొందినవాడు ఎవడు మాట్లాడినా అది జ్ఞానమే. పాండిత్యానికి జ్ఞానానికి సంబంధం లేదు. మనస్సు ద్వారా ఇంద్రియాల ద్వారా నువ్వు సంపాదించిన పుస్తక జన్య జ్ఞానాన్ని పాండిత్యం అంటారు. మీ దగ్గర ఉన్న డబ్బు ఎటువంటిదో పాండిత్యం కూడా అటువంటిదే. జ్ఞానం అంటే అది కాదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. నేను అనేటప్పటికి ఇప్పడు నీకు శరీరం ఎలాగైతే అనుభవంలోనికి వస్తోందో అలాగ నీ హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి వస్తూఉంటే అది జ్ఞానం. ఉన్నది ఒక్కటే, అదే సత్యం. అది నీకు అనుభవంలోనికి రావాలి. బ్రహ్మపదార్థాన్ని సత్యం, శివం, సుందరం అని డిఫైన్ చేసారు. ఇక్కడ శివం అంటే మనం అనుకొనే శివుడు కాదు, శివం అంటే జ్ఞానం, స్వరూప జ్ఞానం.

అండర్‌స్టాండింగ్ అనేది శరీరానికి కాదు, మనస్సుకు సంబంధించినది. కొంతమంది వందేళ్ళు బ్రతికినా కనుబొమ్మల మీద వెంట్రుకలులాగ అలాగే ఉంటారు. ఏమీ గ్రోత్ ఉండదు. అంటే మానసిక వికాశం ఏమీ ఉండదు. ప్రవర్తన కూడా మనస్సు మీద ఆధారపడి ఉంటుంది, గ్రహించటం కూడా మనస్సు మీద ఆధారపడి ఉంటుంది. మాట కఠినంగా ఉందా, సౌమ్యంగా ఉందా ఇది కూడా మనస్సు మీద ఆధారపడి ఉంటుంది. మనస్సులో సత్వగుణం కనుక ఉంటే అతని జీవితవిధానం అందంగా ఉంటుంది.

శివుడు స్థిరం, ఆచార్యుడు చరం. శివుడు గుడిలో స్థిరంగా ఉంటాడు. ఆచార్యుడు శరీరం ధరించివచ్చాడు, భూమి మీద తిరిగాడు. వీడూ శివుడే. దక్షిణామూర్తి మనకు ఆది గురువు, ఆయన శివుడి యొక్క అవతారం, సైలెంట్ టీచర్. మన శరీరానికి కుడి వైపున రూపం లేకుండా ఉన్నాడు. అన్నింటికి సాక్షిగా ఉన్నాడు. మీకు ఏదైనా తలంపు వస్తే ఆ తలంపుకు కూడా సాక్షిగా ఉంటాడు. ఆ తలంపుకు సమాధానం చెప్పేవరకు నిన్ను వెంటాడుతాడు. ఆయనకు తెలియకుండా ఏమీ చేయటానికి అవకాశం లేదు. ఆయనకు తెలియకుండా ఏ తలంపు రావటానికి అవకాశం లేదు. అన్ని తలంపులకు సాక్షిగా ఉంటాడు, ఆయనే దక్షిణామూర్తి. ఈ ముక్కులో గాలి తిరుగుతున్నంతకాలం ఆచార్యుడి గురించి చెబుతాము. టీచింగ్‌కు ఇంక అవకాశం లేనప్పుడు ఈ శరీరం పోయినా పరవాలేదు. టీచింగ్ చెప్పేవాడికి రసహృదయం ఉండాలి. రసహృదయం లేనివాడు టీచింగ్‌కు పనికిరాడు. నీలోపల రసహృదయం లేనప్పుడు నువ్వు టీచింగ్ చెప్పినా అది యాంత్రికంగా ఉంటుంది. వినేవారిమీద ఆప్యాయత ఉండాలి. దక్షిణామూర్తి ఏ సుఖాన్ని పొందుతున్నాడో, ఏ శాంతిని పొందుతున్నాడో, ఏది అనుభవంలో పెట్టుకొని ఆయన మాట్లాడుతున్నాడో ఆ స్థాయికి మీరందరూ రావాలి. శరీరాలు చనిపోయాక మోక్షం రావటం కాదు, ఈ శరీరం ఉండగానే మోక్షసుఖాన్ని పొందాలి. అది ఆచార్యుడి టీచింగ్ యొక్క లక్ష్యం. మీ శరీరం ఎంతకాలం అయితే జీవించి ఉందో అంతకాలం శాస్త్రం పట్లకాని, ఈశ్వరుడి పట్లకాని గౌరవం పాడుచేసుకోవద్దు. మీకు ఈశ్వరుడు అంటే ఇష్టం లేకపోతే ఊరక ఉండండి అంతేకాని నిందపనికిరాదు. శాస్త్రంపట్ల గౌరవంగా ఉండాలి, అగౌరవం పనికిరాదు, అవినయం పనికిరాదు. నీ మనస్సు ద్వారాకాని, నీ శరీరం ద్వారాకాని, నీ

మాట ద్వారాకాని ఈశ్వరుడిపట్ల ఎప్పడూ అగౌరవం వ్యక్తపరచవద్దు. తలంపు, మాట, చేత ఈ మూడింటి ద్వారా నీకు అగౌరవం పనికిరాదు అని ఆచార్యులవారు చెపుతున్నారు. ఇది ఆయన అభిప్రాయమే కాదు, ఉపనిషత్తులు కూడా చెపుతున్నాయి. రామకృష్ణుడు వాళ్ళు చెప్పేసి ఊరుకొంటారు, ఈయన శాస్త్రాన్ని ప్రమాణంగా చూపిస్తారు. ఇది నేను కనిపెట్టి ఏమీ చెప్పటంలేదు, మన పూర్వపు ఋషులు చెప్పిన దానినే రిపీట్ చేస్తున్నాను అంటున్నారు ఆచార్యులవారు. ఇప్పడు మనం ఎలా ఉన్నాము అంటే ఎవడో ఒక మంచి పని చేస్తే గౌరవం మనకు రావాలి అనుకొంటాము. ఫలానావారు మంచిపని చేసారు అని చెప్పటానికి కూడా మనకి మనస్సు ఒప్పదు. ఇటువంటి మనకు జ్ఞానమా? భగవాన్ దగ్గర ఎవరయినా తింగరమాటలు మాట్లాడుతూ ఉంటే, అది జ్ఞానమా అనేవారు భగవాన్. ఈ సృష్టిపట్ల నీకు అద్వైతభావన ఉన్నప్పటికీ గురువుపట్ల గౌరవాన్ని విడిచిపెట్టకు. అన్నం అయినా ఒకటే, సున్నం అయినా ఒకటే, సున్నం తినండి అని ఎవరయినా అంటారా? అలాగే నీకు భావనలో అద్వైతం ఉండాలి, యాక్షన్‌లో అద్వైతం పనికిరాదు. గురువు హృదయంలో ఏ వస్తువు అయితే ఉందో అదే మీ హృదయంలోకూడా ఉంది, అందులో ఏమీ భేదం లేదు కానీ గురువుపట్ల గౌరవం కలిగి ఉండాలి, గురువు పట్ల అద్వైతభావన పనికిరాదు.

నీకు తెలిసున్నా, నీకు తెలియకపోయినా నీ హృదయంలో ఒక సత్యం ఉంది. నీ శరీరం చనిపోయినా దానికి చావులేదు. చావుపుట్టుకలతో దానికి ఏమీ సంబంధం లేదు. నీ హృదయంలో ఉన్న సత్యంలో నేను లేదు, నువ్వు లేవు, వాడు లేడు, సృష్టిలేదు. ఈ ప్రపంచం అంతా కూడా మనస్సు యొక్క క్రియేషన్. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు అక్కడ నువ్వు ఉన్నావు అని నీకు తెలుస్తూ ఉంటుంది, నువ్వు శాంతిగా ఉంటావు, సుఖంగా ఉంటావు, ఈ చావుపుట్టుకలకు, ముసలితనానికి సంబంధం లేకుండా ఉంటావు. నీ లోపల నుండి శాంతి ఉబికి ఉబికి ప్రవహిస్తూఉంటుంది. అప్పడు వంద సంవత్సరాలు నీకు వంద క్షణాలకింద వెళ్ళిపోతాయి. నీ లోపలఉన్న నిజంలో శాస్త్రం లేదు. జ్ఞాని శాస్త్రానికి అతీతుడు. వాడికి నియమాలు ఏమీలేవు. అక్కడ గురుశిష్య సంబంధం ఏమీ లేదు. గురువు అని, శిష్యుడు అని, టీచింగ్ అని అక్కడ ఏమీ లేదు. తెలుసుకొనేవాడు లేడు, తెలియబడేది లేదు, తెలుసుకొనే ప్రయత్నం అక్కడ లేదు. నువ్వు పొందవలసింది పొందిన తరువాత ఇంక ప్రయత్నంతో పనిలేదు. మీరు ఒడ్డుకు వస్తూ

ఉంటే మీకు కొంత తెలుస్తూఉంటుంది. కొలంబస్ అమెరికాను డిస్కవర్ చేసినప్పుడు ఆ ప్రయత్నంలో మనం తెచ్చుకొన్న పదార్ధాలు అన్నీ అయిపోయినాయి, ఇంక వెనక్కి వెళ్ళిపోవటమే అనుకొన్నాడు. అప్పడు ఆయనకు ఆకులు, చెట్ల రొబ్బలు కొట్టుకొనిరావటం కనిపించింది. అంటే దగ్గరలో భూమి లేకుండా ఈ ఆకులు, రొబ్బలు ఎలా వస్తాయి, దగ్గరలో భూమి ఉన్నట్లు గుర్తించి ముందుకు వెళ్ళాడు. అలాగే మీకు కూడా జ్ఞానోదయం అయ్యేటప్పడు కొన్ని సూచనలు తెలుస్తూఉంటాయి. నీకు అద్వైతజ్ఞానం కలిగినప్పడు, ఇప్పడు నువ్వు నేను, నేను అంటున్నావు కదా, ఆ నేను అక్కడ లేదు. అది ఉంటే దానిని పోగొట్టుకోవాలి. అద్వైతజ్ఞానంలో అది లేదు కాబట్టి ఇంక నువ్వు పోగొట్టుకొనేది లేదు, సాధన చేసేది లేదు. నువ్వు విచారణ చేసి పోగొట్టుకోవటానికి ఇంక నువ్వు పోగొట్టుకొనేది లేదు, సాధన చేసేది లేదు. నువ్వు విచారణ చేసి పోగొట్టుకోవటానికి అద్వైతజ్ఞానంలో అసలు నేను అనేది లేనేలేదు. నీకు అద్వైతానుభవం కలిగినప్పడు నీ హృదయంలో ఉన్న సత్యమే నీకు గురువు, దానికి భిన్నంగా గురువు లేడని నీకు తెలుస్తుంది.

ఒకసారి అరుణాచలంలో స్వామి చిన్మయానందను ఏమండీ మీరు ఎర్రబట్టలు కట్టుకొన్నారు. ఉపనిషత్తులు అవి బాగా చదువుకొన్నారు, మీ టీచింగ్ బాగానే ఉంది, ఎవరయినా డబ్బులు ఇస్తే తీసుకొంటున్నారు, మీరు సన్యాసులు కదా మీకు డబ్బులు ఎందుకు అని ఒక రెడ్డిగారు అడిగారు. మిస్టర్ రెడ్డీ యు హేవ్ టూ ఛిల్డ్రన్, ఐ హేవ్ సో మెనీ ఛిల్డ్రన్. నీకు ఇద్దరు పిల్లలు మాత్రమే, కానీ నాకు వేలాది మంది బిడ్డలు ఉన్నారు. నీకు ఇద్దరు పిల్లలు ఉంటేనే అంత డబ్బు కావలసినప్పడు మరి మీకు డబ్బు ఎందుకు అని నన్ను అడుగుతున్నావు. నాకు చాలామంది పిల్లలు కదా మరి నా మాట ఏమిటి? చిన్మయానంద వాళ్ళు టీచర్స్. మా దగ్గరకు చాలా మంది చదువుకోవటానికి వస్తారు. అందులో డబ్బు లేనివారు అయినా చాలా తెలివైనవాళ్ళు ఉంటారు. వాళ్ళకు మేము అన్నం పెట్టాలికదా. డబ్బు లేదని వారిని వదిలేస్తామా? మరి అందరికీ డబ్బు ఉంటుందా? గురువు అడిగితే చెపుతాడు కానీ ఆచార్యుడికి ఇంక అదే పని. ఎవరైనా ఆకలితో బాధపడుతూ ఉన్నా వారికి కనుక జిజ్ఞాస ఉంటే ఒడ్డుకు వచ్చే వరకు వారిని పోషిస్తాడు. అంటే భౌతికంగా కూడా అన్నవస్త్రాదులు చూస్తాడు, వాడు ఆచార్యుడు.

దేహము నేను అనే తలంపు వచ్చాక ప్రపంచం వస్తోంది, శాస్త్రం వస్తోంది, దేవుడు వస్తున్నాడు, ఇంకా చాలా గొడవలు వస్తున్నాయి. ఈ దొంగనేను వచ్చాక మొత్తం అన్ని గొడవలు వస్తున్నాయి, బహుత్వం వస్తోంది. మనం బతికేది కూడా ఈ నేను కోసమే బతుకుతున్నాము. అజ్ఞానం వలన నీకు అనేకత్వం వస్తోంది. నువ్వు ఆత్మనిష్టుడవుకా. ఉన్నది ఒక్కటే. నీకు ఆత్మనిష్ట లేకపోవటం వలన దాని తాలూకు అనుభవం నీకు రావటం లేదు. ఈ దేహగతమైన నేనుకు, దొంగనేనుకు పెద్ద శక్తి ఏమీ లేదు. హృదయంలో ప్రవేశించినప్పుడు అక్కడ ఉన్న ఈశ్వరుడికి ఈ దొంగనేను స్వాధీనమయిపోతుంది. స్వాధీనం అయిన తరువాత దాని ఉనికిని అది పోగొట్టుకొంటుంది. అప్పుడు మీకు ఎటు చూసినా ఆనందమే, ఎటు చూసినా శాంతే. ఇవన్నీ ఒట్టిమాటలు కాదు, వాళ్ళు ఎక్స్‌పీరియన్స్ చేసి చెపుతున్నారు. అసలు నీకు రియలైజేషన్ ఉంటే పబ్లిసిటీ ఎందుకు? పబ్లిసిటీ అక్కరలేదు. అబద్ధానికి ప్రచారం కావాలి, కాని సత్యానికి ప్రచారం అక్కరలేదు. మీరు ప్రజాసేవ చేస్తున్నారు అనుకోండి. మీరు చేసే ప్రజాసేవ ఈ నేను గ్లోరిఫై చేసుకోవటానికి చేస్తున్నారా లేక వారిని నిజంగా ఉద్ధరించటానికి చేస్తున్నారా? వాళ్ళు బాగుపడటానికి ప్రజాసేవ చేస్తున్నారా లేక మీరు గొప్పవాళ్ళు అని అందరూ చెప్పకోవటానికి చేస్తున్నారా? మీరు మంచిపనులు చేస్తూ ఉంటే మీరు మంచిపనులు చేస్తున్నారని అందరూ చెప్పకోవటానికి ఆ పనులు చేస్తున్నారా లేక మంచిపనులు మంచిపనుల కోసమే చేస్తున్నారా అది చూసుకోండి.

దేశబంధు ఈజ్ డెడ్, లాంగ్ లివ్ దేశబంధు, వాడే సి.ఆర్ దాస్. దేశబంధు శరీరం వెళ్ళిపోయింది. ఆ రూపం మనకు కనబడకపోయిన వాడి హృదయం, వాడు మాట్లాడిన మాటలు, వాడు చేసిన పనులు, వాడి జ్ఞాపకం మన హృదయంలో చిరకాలం ఉండుగాక. ఈ బాపూజీ మాటలకు నాకు ఆనందం వచ్చేస్తోంది. మీకు వినటానికి విసుగు రావచ్చు కాని, నాకు చెప్పటానికి విసుగు లేదు. ఈ మాటలు బాపూజీ హృదయాన్ని చీల్చుకొని వచ్చాయి. వీటిని ఇమ్మోర్టల్ వర్డ్స్ అంటారు. నీకు ఆత్మభావన కలిగాక అక్కడ వ్యక్తిభావన నిలబడదు. అప్పుడు వ్యక్తిభావన పోగొట్టుకోవటానికి మీరు ఏమీ ప్రయత్నం చేయనక్కరలేదు దానంతటఅదే పోతుంది. ఫలానా శరీరం నాది, ఫలానా పేరు నాది, నా పేరు చిరకాలం ఉండాలి, ఇలా అనుకొనేవాడు ఎవడూ అక్కడ ఉండడు. అద్వైతానుభవంలో అలా అనుకొనే

'ఐ'పోతుంది. అద్వైతానుభవం దేహగతమైననేనును శేషం లేకుండా ఊడ్చేస్తుంది. దేహగతమైననేను అణగిఉండటం వేరు, చనిపోవటం వేరు. అణగిఉంటే ఎప్పటికైనా అది తిరిగి విజృంభిస్తుంది. అది చనిపోతే ఇంక విజృంభించే అవకాశం లేదు. ఫలానా శరీరం నాది, ఫలానా కులం నాది, ఫలానా మతం నాది అని ఇలా ప్రపంచంలో ఎవ్వరితోటి మీకు తాదాత్మ్యం ఉండదు. మీరు ఎవరి వారు కాదు, ఎవరూ మీవారు కాదు, అక్కడ వ్యక్తి కనబడడు. మీ శరీరానికి కేన్సర్ వచ్చింది. మేము డాక్టర్లను తీసుకొని వస్తున్నాము కాని అది పోవటం లేదు. మీకు కేన్సర్ తగ్గిపోవాలి అని మేము అనుకొంటున్నాము. మేము అనుకొంటే సరిపోదు. కేన్సర్ తగ్గిపోవాలని మీరు కూడా అనుకోండి అని భక్తులు భగవాన్‌తో అంటున్నారు. భగవాన్ ఏమన్నారు అంటే అలా అనుకొనేవాడు లోపల ఉన్నప్పడు మీరు చెప్పకపోయినా అనుకొంటాడు. వాడు ఎప్పడో పోయాడు. మీరు అనుకొనేవాడు ఇక్కడ లేడు. ఇక్కడ ఉన్నవాడు ఎవడో మీకు తెలియదు. నేను చెప్పినా మీకు అర్థంకాదు. ఒక జ్ఞాని ఇంకో జ్ఞానికే అర్థమవుతాడు కానీ అజ్ఞానికి అర్థం కాడు.

మిథ్యానేను ఉన్నప్పడే మీకు వ్యవహారం ఉంటోంది. వ్యవహారంలో మీరు అద్వైతాన్ని జోడించకండి. లోపలఉన్న వస్తువు అనుభవంలోనికి వచ్చినప్పడే అద్వైతం మీకు అనుభవంలోనికి వస్తుంది. అద్వైతానుభవం వచ్చినప్పడే మీకు క్లారిటీ వస్తుంది. కొంతమంది మాటల్లో అసలు క్లారిటీ ఉండదు. వారు ఏమి మాట్లాడుతున్నారో వారికే తెలియదు, వారిని క్షమించి ఆశీర్వదించు అంటాడు ఏసు. నీకు ఆత్మానుభవం కలిగినప్పడు అక్కడ గురు, శిష్య భావన ఉండదు. వ్యవహారం దగ్గరకు వచ్చేటప్పటికి ఈశ్వరుడి పట్ల గౌరవభావన విడిచిపెట్టవద్దు. వాడు, నేను ఒకటే అనుకోకు. వ్యవహారం దగ్గరకు వచ్చేటప్పటికి ఈశ్వరుడు ఈశ్వరుడే, జీవుడు జీవుడే. అద్వైతం అనేది ఒక అనుభవం, అది వ్యవహారానికి సంబంధించినది కాదు. ప్రపంచం అంతా ద్వైతమే కదా! శంకరుడికి కూడా గురుభక్తి పోలేదు, రమణుడికి ఆ కొండే గురువు. భగవాన్ చివరి శ్వాస టైములో కూడా అక్కడ ఉన్న భక్తులు అరుణాచలశివ, అరుణాచలశివ అని చాంటింగ్ చేస్తూ ఉంటే అది విని ఆయన కన్నీరు కార్చారు. అంటే ఆయనకు గురుభక్తి పోలేదు. అరుణాచలం మీద రమణుడికి ఎటాచ్‌మెంట్ ఉంది, దానికి గురుభక్తే కారణం. ఆయనకు ఈశ్వరుడే గురువు అయ్యాడు.

అద్వైతంలో భక్తి ఉండదు అనుకోవద్దు. జ్ఞానం యొక్క తల్లే భక్తి. తల్లి లేకుండా పిల్లవాడు రాడు అలాగే భక్తి లేకుండా జ్ఞానం రాదు. మీరు గుడికి వెళ్ళి అక్కడ ఒక రూపాయి వేస్తే అది పూజ అనుకొంటున్నారు, అదే ఎవరో ఒక మనిషికి ఇస్తే మరి దానం అని ఎందుకు అనుకొంటున్నారు. అది మీ బుద్ధిలో ఉన్న దోషం. అక్కడ అంతర్యామిగా ఉన్నది ఈశ్వరుడే. దానం, ధర్మం గురించి చాలామంది రకరకాలుగా చెప్పారు కాని భగవాన్‌ది హయ్యస్ట్. నువ్వు ఇచ్చేదీ లేదు, పుచ్చుకొనేదీ లేదు. గివ్వర్ లేడు, టేకర్ లేడు. కుడిచేతిలో ఉన్నది ఎడమచేతిలో పెట్టుకొని ఎవరికైనా ఇచ్చాను అనుకొంటావా? అలా అనుకోవు, ఎందుచేతనంటే రెండు చేతులు నీవే. ఎవరికైనా ఇచ్చాను అనే భావన రాదు, ఇదీ అంతే. నువ్వు ఎవరికి ఏది చేసినా అది నీకు నువ్వే చేసుకొంటున్నావు. నువ్వు ఎవరినైనా బాగుచేసినా అది నిన్ను నువ్వే బాగుచేసుకొంటున్నావు. అది నీకు తెలియక ఇతరులను ఉద్ధరించాను అనుకొంటున్నావు. వాళ్ళకు ఏదో ఇచ్చాము, వీళ్ళకు ఏదో ఇచ్చాము అంటారు. ఇతరులకు ఇచ్చింది అంతా తిరిగి నీకే వస్తుంది. ఇంక ఇవ్వటం ఏముంది? పుచ్చుకోవటం ఏముంది? గివింగ్ లేదు, టేకింగ్ లేదు. ఓన్లీ షేరింగ్ అంతే. గివర్, టేకర్ అనే మాటల వల్ల రజోగుణం పెరుగుతుంది. అందుచేత షేరింగ్ అనే మాటను ఉపయోగించండి. నీ చూపులో గాని, నీ మొఖంలోగాని అవినయం రాకుండా చూసుకో. సత్వగుణాన్ని ప్రాక్టీసు చెయ్యి.

ఇక్కడ ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే మీరు నోటితో ఒకమాట మాట్లాడినా, చేతితో ఒక పని చేసినా ఒకవేళ వ్యవహారం చేసినా అది ప్యూర్‌గా ఉండాలి, నిర్మలంగా ఉండాలి. పబ్లిసిటీ పనికిరాదు. మీరు కాశీ వెళుతున్నారు అనుకోండి. మీరు కారు మారినా, రైలు మారినా, ఏది మారినా మీ దృష్టి అంతా కాశీ మీదే ఎలా ఉంటుందో అలాగే మీరు ఏది మాట్లాడినా, ఏ పని చేసినా, సాధన చేసినా మీ మాట, చేత, మీ తలంపు కూడా మీ మనస్సు అంతర్ముఖం అవ్వటానికి సహకరించాలి. వీటి ద్వారా మన హృదయంలో ఉన్న వస్తువు అనుభవైకవేద్యం అవ్వాలి. అదే మన గమ్యంగా పెట్టుకోవాలి. అదే గమ్యంగా పెట్టుకొని మీ బిహేవియర్ పేటర్న్‌ను సరిదిద్దుకోండి అని ఆచార్యులవారు చెపుతున్నారు. మన మాట, చేత ఇంపెర్సనల్‌గా ఉండాలి. మీకు ఆరోజుకారోజు వ్యక్తిభావన తగ్గుతూ ఉండాలి. కొంతమంది మేము చాలా తెలివైనవాళ్ళము అనుకొంటారు. వాళ్ళ నెత్తిమీద అక్షింతలు వేసేవాళ్ళు కనబడరు,

వాళ్ళే వేసేసుకొంటారు. అది మరీ ప్రమాదం. మీరు జాగ్రత్తగా ఉండండి అంటున్నారు ఆచార్యులవారు. మీ ప్రవర్తన ద్వారా మీరు చీకటిలో నుండి వెలుతురులోనికి, దుఃఖంలో నుండి శాంతిలోనికి ప్రవేశించాలి కాని మీరు ప్రయాణించవలసింది దుఃఖంలోనికి, చీకటిలోనికి కాదు. నన్ను అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి, చీకటిలోనుండి వెలుతురు లోనికి తీసుకొని రా ఈశ్వరా. నాపట్ల దయ చూపించి ఆ పని నువ్వే చెయ్యాలి కాని నీకు రికమండేషన్ ఎవరు చేస్తారు. ఈ రోజు ఆచార్యులవారి సందేశం ఏమిటి అంటే మనకు వచ్చే ఆలోచన, మన మాట, మన చేత మన లోపల ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి అనుగుణంగా ఉండాలి, ఆవిధంగా మన జీవిత విధానాన్ని మలుచుకోవాలి అని ఆచార్యులవారు చెపుతున్నారు. ఈ మహాశివరాత్రి రోజున మీకు అందరికీ శివుడి ఆశీస్సులు ఉండాలని, నిర్వాణసుఖంతో మిమ్మల్ని ఆశీర్వదించాలని, మీకు అందరికీ శివానుగ్రహం ఉండాలని శివుడిని ప్రార్థిస్తున్నాను.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-03-2017, చించినాడ)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవంతుడిచేత గానం చేయబడినది భగవద్గీత. భగవద్గీత బోధగ్రంథం, సమన్వయ గ్రంథం. కృష్ణుడు స్వయంగా భగవంతుడు. మనకు గీతలు చాలా ఉన్నాయి. కృష్ణుడు చెప్పిన గీతకే భగవద్గీత అని పేరు వచ్చింది. ఎందుచేతనంటే ఆయన వాసు దేవుడి గారి అబ్బాయిగా చెప్పలేదు, భగవంతుడు అయి చెప్పాడు. రాధాకృష్ణులను హరేకృష్ణవాళ్ళు ఎక్కువగా ఆరాధిస్తారు. రాధ కృష్ణుడి భార్య కాదు. రాధ ఒక గోపిక. ఆమెకు కృష్ణుడిపట్ల హద్దులు లేని అపారమైన ప్రేమ, ఆప్యాయత. అది భౌతిక సంబంధమైనది కాదు, అది డివైన్ లవ్. రాధ హృదయంలో ఒక్క స్వామికి తప్పించి మిగతా వారికి ఎవరికీ చోటు లేదు. రాధ ఏ విధంగా అయితే భగవంతుడిని ప్రేమించిందో, హద్దులు లేని ప్రేమతో భక్తితో భగవంతుడికి శరణాగతి చేసిందో అలా జీవుడు భగవంతుడిని ప్రేమించగలిగితే వాడు భగవంతుడిలో ఐక్యమవుతాడు అని గుర్తుగా హరేకృష్ణవాళ్ళు రాధాకృష్ణుల ప్రేమను ఆదర్శంగా తీసుకొంటారు. మనం కృష్ణాష్టమి ఎలా చేసుకొంటామో అలా ఉత్తరప్రదేశ్‌లో రాధాష్టమి చాలా వైభవంగా చేసుకొంటారు.